## క్లుప్తంగా

### వీఆర్‌ఏ సస్పెన్షన్

యడ్లపాడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వీఆర్‌ఏను సస్పెండ్ చేసినట్లు ఏఆర్‌వో, తహసీల్దార్ మొహమ్మద్ అఫ్రవూన్నీసా చెప్పారు. మండలంలోని మైదవోలు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రాజకీయ నాయకులు సమావేశానికి హాజరైనందుకు అంబటి నాగేశ్వరరావును సంజాయిషీ కోరుతూ బుధవారం సస్పెండ్ ఆర్డర్‌ను జారీచేసినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులెవ్వరూ రాజకీయ పార్టీల సమావేశాలకు హాజరుకావద్దని తెలిపారు.

### నాగవాణికి రాణిరుద్రమదేవి జాతీయ అవార్డు



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణికి రాణిరుద్రమదేవి జాతీయ ఉత్తమ మహిళా సేవాపురస్కారం వరించింది. మార్క్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఈ సేవా పురస్కారాన్ని అందించి నిర్వాహకులు సత్కరించారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లో ఆమె చేస్తున్న సేవల గురించి కొనియాడారు. అవార్డు పొందిన నాగవాణిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

### బీజేపీవి మతోన్మాద, కార్పొరేట్ విధానాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు



నరసరావుపేట: ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపి పోరాటాలకు సిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం రైతు, కార్మిక, మహిళా, విద్యార్థి యువజన ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించారు.

రాధాకృష్ణ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళన సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 23న భగత్‌సింగ్ వర్ధంతిని వాడవాడలా నిర్వహించి ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకులు తోట ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, మండల అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు పాల్గొన్నారు.

### ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశాలు



పెదకూరపాడు: ప్రతిభ కలిగిన ప్రతి విద్యార్థికి భవిష్యత్‌లో అవకాశాలు ఉంటాయని హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ గురునాథం అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల కళాశాలను ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐటీ రంగంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ గురునాథం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత ఐటీ రంగంలో అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో విద్యార్థులకు వివరించారు.

ప్రతిభకల విద్యార్థులను ఎంపిక చేసి ఆరు నుంచి 12 నెలల పాటు హెచ్‌సీఎల్ కంపెనీ శిక్షణ ఇస్తుందని తెలిపారు. శిక్షణ కాలంలోనే ప్రతినెలా రూ. 10 వేలు స్టయిఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రూ. 2.20 లక్షల వార్షిక వేతనం ఇస్తామన్నారు. ఒక పక్క జాబ్ చేస్తూ చదువులో రాణించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పీజీటీలు బాజీఖాన్, అజిత, రమణ, మూర్తి, ఏసుబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వాణి, తదితరులు పాల్గొన్నారు.

# దైవజనులు సంకల్పమే జగనన్న విజయానికి సోపానం

పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనీల్, డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్. వేదికపై డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

నరసరావుపేట: దైవజనుల మహాసంకల్పమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి సోపానాలని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జమిందార్ ఫంక్షన్ హాలులో కృపా టీవీ ఆవిష్కరణకు ఇరువురు నేతలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ తమ పార్టీకి మేనిఫెస్టో బైబిల్‌తో సమానమన్నారు. వైఎస్సార్ సీపీ మతతత్వ పార్టీ కాదని పేర్కొన్నారు. సుమారు రూ.2.5 కోట్లతో ఏడు చర్చిలను పూర్తి చేశామన్నారు. రానున్న ఎన్నికలలో విజయం సాధించి మిగతా చర్చిలను కూడా త్వరగా పూర్తి చేసి క్రైస్తవ సోదరులకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కృపా టీవీకి చెందిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పడాల సాంబ శివారెడ్డి, స్వచ్ఛాంధ్ర, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, జిల్లా ఎస్సీసెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటినపాటి గాబ్రియేలు, టౌన్ బాప్టిస్టు చర్చి కార్యవర్గ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్, కాకుమాను మంగపతిరెడ్డి, పలువురు పాస్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీజీ కలలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం

- చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు
- తిమ్మాపురంలో పర్యటన



తిమ్మాపురంలోని నాయకులతో మనోహర్ నాయుడు

యడ్లపాడు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆయన బుధవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పరిచయం చేసుకుంటూ.. సంక్షేమ పథకాలను వివరించారు. ముందుగా పార్టీ నాయకులు పావులూరి శ్రీనివాస బాబు, నాగండ్ల సాంబయ్య నివాసాలకు వెళ్లారు. వారితో కలసి ఎస్సీ కాలనీలోని కొప్పుల శ్యామ్యేల్‌పాల్ నివాసం, కత్తి జేస్సీబాబు, చంద్రశేఖర్‌ల కుటుంబాలతో పాటు రెండు ఎస్సీ కాలనీల్లోని పలువురిని కలిసి స్థానిక వివరాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పి గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారన్నారు. అధికారులు ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి ఈ వ్యవస్థ బీజం వేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి పాలన మరింత కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ నాయకులు గ్రామస్తులందరినీ సమన్వయం చేసుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, నాయకులు రావూరి రామారావు, నాగండ్ల మృత్యుంజయ, సాంబశివరావు, ముద్దన పుల్లయ్య, కుర్రా హుస్సేన్‌రావు, పెద్ది ఆంజనేయులు, పిడతల దయాసాగర్, బిరుదు అనంతబాబు, రాంబాబు, వి. శ్రీనివాసనాయక్, పందుల బుల్లెబ్బాయి, పుల్లగూర పరదేశీ, అన్నలదాసు శ్యాంపాల్, కర్నాటి సుబ్బారావు, సాయి, ఉప్పరపాలెం కోటి, కూడారి జాన్సన్, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రెండోవార్డులో పర్యటించిన మున్సిపల్ కమిషనర్



నరసరావుపేట: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటారో అదేవిధంగా తమ చుట్టుపక్కల ప్రాంతాలను కూడా సామాజిక బాధ్యతగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెండోవార్డు ఐలా బజారులో కాలువలు శుభ్రం చేయట్లేదని, మురికినీరు రోడ్లపై ప్రవహిస్తుందని వచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఆయన స్వయంగా తానే ఆ ప్రదేశానికి వెళ్లి దగ్గరుండి వర్కర్ల ద్వారా కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ఇప్పుడు తీసిన కాలువ నందు ఎక్కువగా కురుకురే ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసులు అడ్డం పడడం వల్లనే నీరు ఆగిపోయిందన్నారు. కావున ప్రతి చిన్న పని పురపాలసంఘం వారే చేయాలనే ఉద్దేశంతో కాకుండా సామాజిక బాధ్యతతో తమవంతు కృషి చేస్తే ఇలాంటి సమస్యలు త్వరగా పరిష్కరించుకోగలుగుతామని తెలియజేశారు. మురుగు కాల్వల్లో మంచినీటి పైప్‌లైన్లు ఉంటే వాటిని గుర్తించి కాలువలకు దూరంగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమినిటీ సెక్రటరీని ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

### పట్టణంలో పోలీసు కవాతు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్, తదితర ప్రాంతాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వైభవంగా నాగేశ్వరస్వామి పునఃప్రతిష్ట



పునః ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిలకలూరిపేట: పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో పునఃనిర్మాణం చేసిన శ్రీగంగా బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం పునః ప్రతిష్టా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులతో యంత్ర స్థాపనములు, బింబస్థాపనములు, దిష్టికుంభం, ధేనుదర్శనములు, కళాహోమములు, పూర్ణాహుతి, అవభృథము, మహదాశీర్వచనము, శాంతి కల్యాణం, మంగళహారతి, భక్తజన కోటి దివ్యదర్శనం ఏర్పాటు చేశారు.ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్ పి.వీరనారాయణ, సభ్యులు జి.రమణమూర్తి, వి.లక్ష్మీనారాయణ, ఎల్.ఆదినారాయణరెడ్డి, పి.పూర్ణచంద్రరావు, బి.సుబ్బారావు, జి.పోలయ్య, జి.నాగభూషణం, పి.శివసత్యనారాయణ, వారణాసి వెంకట సుబ్రమణ్యం దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం.సుబ్బారావు, సభ్యులు డి. నాగేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాసరావు, పి.శివనాగలక్ష్మి, టి నాగజ్యోతి, టి.అంజమ్మ, ఆలయ ఈవో ఆర్ సాయిబాబు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

- గ్రామాల్లో రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగింపు
- విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేయాలి



వినుకొండలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక అధికారి సుబ్బారావు



బొల్లాపల్లిలో బ్యానర్లు తొలగిస్తున్న సిబ్బంది



టీడీపీ జెండాకు ముసుగు వేయిస్తున్న అధికారులు

బొల్లాపల్లి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో, ఎంసీసీ ఇన్‌చార్జి వీపీ విజయకుమార్ తెలిపారు. మండలంలోని గండిగనుమల సచివాలయ పరిధిలోని గ్రామాలను బుధవారం సందర్శించారు. ఆయా సచివాలయాల పరిధిలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలనే కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు ఉంటాయన్నారు. స్వచ్ఛందంగా ఉచిత మంచినీరు సరఫరా చేసే ట్యాంకర్లకు స్టిక్కర్లను తొలగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమావళిని తూ.చ తప్పకుండా పాటించాలని తెలిపారు. ఆయన వెంట వీఆర్వో నరసింహారావు, సచివాలయ కార్యదర్శి సురేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు అన్నారు. నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తేదీ ప్రకటన వెలువడిన నాటి నుండి కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందన్నారు. నూతన ఓట్లు చేర్చుకునేందుకు మాత్రమే అవకాశం ఉందని, ఫారం 7, 8లను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదన్నారు. వ్యక్తులు ఎవరైనా 50 వేల రూపాయలకు మించి కలిగి ఉన్నా, ఆర్థిక లావాదేవీలు నిర్వహించినా, 10 వేల రూపాయల విలువకు మించి వస్తువులను కలిగి ఉన్నా సదరు అంశాలపై సరియైన పత్రాలతో వివరణ ఇవ్వవలసి ఉంటుందని, ఆధారాలు చూపని పక్షంలో సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఫిర్యాదు అందుకున్న 100 నిముషములలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో వీరభద్రాచారి, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముందస్తు చర్యలు

శావల్యాపురం: ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య కోరారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 32 వేల 409 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు –15897, మహిళలు–16,542 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు వచ్చే నెల 15 వరకు 18 సంవత్సరాల నిండిన వారందరూ సమగ్ర ఆధారాలతో నూతన ఓటు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. అలాగే మండలంలో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పోలింగ్ కేంద్రాలన్నీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించటంతో పాటు మౌలిక వసతులు అన్నీ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల సజావుగా జరగటానికి ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నిబంధనలు ప్రజాప్రతినిధులు ప్రజలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య తదితరులు ఉన్నారు.

### జెండాలు తొలగించి...

నాదెండ్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా నిబంధనావళి అమల్లో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో ఇటీవల టీడీపీ నేతలు దేవస్థానం యాగశాల వద్ద భారీ జెండాను ఏర్పాటు చేశారు. ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో గ్రామంలో అన్ని చోట్ల రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించి, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను మాత్రమే మూసివేయగా, పైనున్న టీడీపీ లోగో తొలగించలేదు. దీంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు రావటంతో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ ఆదేశాలతో పోలీసు సిబ్బందితో పాటూ పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు క్రేన్ సాయంతో పై ఎత్తులో ఉన్న లోగో, జెండా కర్రకు ముసుగు వేశారు.

వలంటీరు, సచివాలయ వ్యవస్థలు కావాలంటే..

# మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- రెండో వార్డులో ఎన్నికల ప్రచారం



రెండో వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వ పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన వలంటీరు, సచివాలయ వ్యవస్థలు కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని రెండోవార్డు వంగవీటి రంగా విగ్రహం వద్ద నుంచి నాయకులు, కార్యకర్తల సందడి మధ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో అమలు చేసిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి గురించి ముద్రించిన కరపత్రాలను స్థానికులకు అందజేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడేందుకు, పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ అనీల్‌కుమార్ యాదవ్, తనను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వార్డులోని మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ వారు వస్తే వలంటీరు వ్యవస్థను తొలగిస్తామని చెబుతున్నారని, మీకు ఆ వ్యవస్థ కావాలా వద్దా అంటూ ప్రశ్నించగా కావాలంటూ మహిళలు సమాధానమిచ్చారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అమలు చేస్తానని వాగ్దానం చేసిన సీఎం జగన్ రూ.26 వేలు కోట్లు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. జగనన్న కాలనీలో పట్టణంలోని ఎనిమిది వేల మందికి పట్టాలు ఇవ్వటం జరిగిందని, ఆ పట్టాలకు ఒక్కొక్క దానికి రూ.8,500లు ఖర్చుచేసి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పంపిణీ చేశామన్నారు. దీని వలన ఆ పట్టా బ్యాంకులో కుదువ పెట్టుకోవచ్చని, పిల్లల పేర్లపై బదిలీ చేసుకోవచ్చన్నారు. అమ్మఒడి అమలుచేసి పేద వర్గాలు తమ పిల్లలను పైసా ఖర్చు లేకుండా చదివించుకోగలిగే అవకాశం కల్పించారని, జగనన్న గోరుముద్ద అమలుచేశారన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చటం జరిగిందన్నారు. మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,500లు ఇవ్వటం జరిగిందని, కాపు నేస్తం వార్డులోని 85 మంది మహిళలకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇవ్వటం జరిగిందన్నారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటేనే పథకాలు అమలు అవుతాయని తెలియ చెప్పారు.

కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కనీస వేతన అమలు చట్టం జిల్లా సభ్యు లు రామిసెట్టి కొండలరావు, నాయకులు ఎస్‌కే ఆంజనేయులు, మాడిశెట్టి దుర్గా మల్లేశ్వర రావు, కోటప్పకొండ కమిటీ సభ్యురాలు స్వర్ణాదేవి, మాజీ కౌన్సిలర్లు మాడిశెట్టి వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి రాము, బాబ్జి, షేక్ రెహమాన్, టమటం శ్రీను, ఐలా ఉమాలు, షేక్ షబ్బీర్, నిమ్మిశెట్టి తిప్పరయ్య, శ్రీనివాసరావు, సయ్యద్ ఫాతిమా, సీహెచ్.అనురాధా రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై టీడీపీ నేతల దుష్ప్రచారం

- పాఠశాల శ్లాబు నిర్మాణాన్ని అడ్డుకున్న వైనం
- తిప్పికొట్టిన అధికారులు
- శ్లాబు నిర్మాణం పూర్తి



తూబాడులో పాఠశాల శ్లాబు నిర్మాణ పనులు

నాదెండ్ల: తూబాడు గ్రామంలో నాడు–నేడు ఫేజ్–2 ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేసి అడ్డుకునే యత్నం చేశారు. దీన్ని అధికారులు తిప్పికొట్టి పనులు యధావిధిగా నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. తూబాడు గ్రామంలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో 42వ పోలింగ్ బూత్ కొనసాగుతోంది. నాడు–నేడు ఫేజ్ 2 ద్వారా రూ.12 లక్షల నిధులు పాఠశాలకు మంజూరయ్యాయి. ఇప్పటికే రూ.6 లక్షల వ్యయంతో పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు, మెయిన్ గేట్, కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేశారు. మిగిలిన రూ.6 లక్షలను పాఠశాల అభివృద్ధికి వెచ్చించేందుకు అధికారులు నిర్ణయించుకున్నారు. పాఠశాల పైకప్పు పెచ్చులూడుతుండటంతో శ్లాబు వేసేందుకు అనుమతి తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం శ్లాబును పగలగొట్టి సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం శ్లాబు వేసేందుకు అధికారులు సమాయత్తం కాగా, టీడీపీ నాయకులు స్థానికులను రెచ్చగొట్టి పనులు నిలిపివేసే ప్రయత్నం చేశారు. ఆరోజు పనులు నిలిచిపోయాయి. మరుసటిరోజు గ్రామస్థాయి అధికారులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. బుధవారం పోలీసుల సమక్షంలో శ్లాబు నిర్మాణ పనులు పూర్తి చేశారు. త్వరలో యధావిధిగా పోలింగ్ బూత్ ఏర్పాటు కానుంది.

## వేర్వేరుచోట్ల దేవాలయ ప్రతిష్టలు



వి.అప్పాపురంలో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



బెహరావారిపాలెంలో పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ అనిల్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

### వి.అప్పాపురంలో

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం వి.అప్పాపురం గ్రామంలో శ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే దేవాలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వీరబ్రహ్మేంద్రస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### బెహరావారిపాలెంలో..

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల శివారు బెహరావారిపాలెం గ్రామంలో బుధవారం శ్రీ కోదండరామస్వామి ఆలయ విగ్రహ ధ్వజ ప్రతిష్ఠ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం ఉదయం 10.26 నిమిషాలకు పుష్యమి నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాంశంలో విగ్రహ, ధ్వజ కలశాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని బెహరావారి పాలెం గ్రామం బంధు మిత్రులతో తిరునాళ్ల వాతావరణం నెలకొంది.

### కొత్తసాలసలో..

యడ్లపాడు: మండలంలోని కొత్త సాలస గ్రామంలో వేంచేసి ఉన్న గణపతి దత్తాత్రేయ సమేత షిరిడీ సాయిబాబా దేవాలయ 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వేకువ జామునుంచే ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు మొదలయ్యాయి. బాబావారికి కాగడా హారతి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, బాబావారికి భక్తులచే పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, సాయిచాలీసా, మధ్యాహ్న హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించారు.



షిరిడీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయ ధర్మకర్త కిలారు కుప్పుస్వామి, గ్రామప్రజల సహకారంతో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు, అన్నసంతర్పణ కార్యక్రమం జరిగాయి. సాయంత్రం ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.